## సుదీర్ఘ శ్రమకు ప్రత్యేక గుర్తింపే జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి

**-జిహెచ్ఎంసి యుసిడి అధ్యక్షులు సాయికృష్ణ**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా రెండు దశాబ్దాలకు పైగా శ్రమించిన తమను గుర్తించిన జిహెచ్ఎంసి మేలు తమ కుటుంబాలు చిరస్థాయిగా గుర్తిస్తాయని యూనియన్ అధ్యక్షులు సాయికృష్ణ అన్నారు. నగరమేయర్ విజయలక్ష్మికి యూనియన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. గత రెండుదశాబ్దాలకు పైగా తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను గుర్తించి జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయడం పట్ల నగర మేయర్ విజయలక్ష్మి చేసిన కృషి తమకుటుంబాలలో కొత్తవెలుగు, ఆత్మవిశ్వాసం కల్పించాయని ఆయన కొనియారు. ఈసందర్భంగా నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని జిహెచ్ఎంసి యుసిడి విభాగంలోని కమ్యూనిటీ ఆర్గనైజర్ల యూనియన్ అధ్యక్షులు సాయికృష్ణ, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి సైదులు, మీడియా కోఆర్డినేటర్ మురళి, యూనియన్ ప్రతినిధులు తాజుద్దీన్, బావ్‌సింగ్, రాంబాబు, యాకయ్య, ఉపేందర్ తదితరులు మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి అభినందనలు తెలిపారు.

## కమ్యూనిటీ వాలీబాల్ టోర్నీ ప్రారంభం


వాలీబాల్ టోర్నీ ప్రారంభిస్తున్న సిఐ

**అల్వాల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:**
కమ్యూనిటీ బాలీబాల్ టోర్నీని అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ శుక్రవారం ప్రారంభించడం జరిగింది. గోల్నాక ప్లే గ్రౌండ్‌లో ప్రారంభమైన పోటీలులో పోలీసు సిబ్బందితో పాటుగా స్థానిక యువత, పౌరులు పాలు పంచుకుంటున్నారు. పోలీసులు పౌర సమాజం నడుమ సఖ్యత కోసం పోటీలు ఎంతగానో ఉపయోగ పడతాయని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సురేష్, శంకర్ గౌడ్, అంబిక, వర్మ, చందిల్, మోహన్ దాస్ ఇతరులు పాల్గొన్నారు.

### ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన డిసి


క్యాంటిన్‌ను ప్రారంభించిన డిసి శ్రీనివాస్ రెడ్డి

**అల్వాల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:**
జిహెచ్ఎంసి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను డిసి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మహిళలు స్వయం శక్తితో ఎదగాలన్నది ప్రభుత్వ విధానమని డిసి తెలిపారు. క్యాంటీన్ నిర్వాహకులు ఉమాదేవి, లక్ష్మీ, మంజుల(దేవిమహిళా సంఘం) సభ్యులను డిసి అభినందించారు.

### దోమల నివారణ మార్గాలు పాటించండి : కమిషనర్


బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని పీరంచెరువు జెఎన్నారం కాలనీలో దోమల నివారణపై ప్రజలకు అవగాన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

**నార్సింగి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని ప్రజలంతా దోమల నివారణ మార్గాలు పాటించాలని కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం కార్పోరేషన్ పరిధిలోని పీరంచెరువు జెఎన్నారం కాలనీలో ఉన్న ప్రజలకు దోమల నివారణ మార్గాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఎక్కడ చెత్త, నీరు నిలువ ఉంటుందో అక్కడ దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటు వ్యాధులను వ్యాపింపచేస్తాయన్నారు. ప్రజలు ఎవరి ఇళ్లను వారు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాత డబ్బాలు, టైర్లు, కుండలు, పూల కుండీలను వారానికి ఒక్కసారైనా కడుక్కోవాలని సూచించారు. దోమల కాటు వల్లనే మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. వ్యాధులు వచ్చిన తరువాత బాధ పడేకన్నా, వ్యాధి కారకాల నివారణ మార్గాలు పాటించాలని తెలిపారు. దోమ తెరలు వాడాలని, దోమలు వృద్ధి చెందకుండా ఇళ్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్ పాల్గొన్నారు.

### నార్సింగి మున్సిపల్‌లో స్వచ్ఛహీసేవా పోస్టర్ ఆవిష్కరణ


నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత హి సేవ-2024 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న చైర్ పర్సన్ నాగపూర్ణ, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డిలు.

**నార్సింగి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త :**
నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డిలు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ మెషిన్‌లో భాగంగా ఈనెల 17.వ, తేదీ నుంచి అక్టోబర్ 2.వ,తేదీ వరకు నిర్వహించాల్సిన స్వచ్ఛ హీసేవాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం వంటి అంశాలపై పక్షం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు, ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

### సీతారామ్ ఏచూరి మరణం తీరని లోటు

**-బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్**

**చిక్కడపల్లి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:**
సిపిఎం జాతీయప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరీ మరణం పేద ప్రజలకు, కమ్యూనిస్ట్ ఉద్యమానికి లౌకికవాదానికి తీరని లోటని బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి బిఆర్‌టియు రాష్ట్ర కార్యాలయంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరీ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సంస్మరణ సభలో కనీసవేతనాల సవరణ బోర్డు పూర్వ చైర్మన్ పి.నారాయణ, బిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, కార్యదర్శులు వి.రాముయాదవ్, రమేశ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. రాంబాబుయాదవ్ మాట్లాడుతూ సీతారాంఏచూరీ మరణం కమ్యూనిస్ట్ వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు దశ, దిశా, నిర్దేశం చేశారని వివరించారు.


విఘ్ననాదునికి ప్రత్యేక పూజలు చేస్తున్న హఫీజ్‌పేట్‌డివిజన్ కాంగ్రెస్ నేత బాలింగ్ గౌతం గౌడ్


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పోరేటర్లు


మధురానగర్ బి బ్లాక్‌లో వినాయక మండపంలో పూజల్లో పాల్గొన్న జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాధ్.


వినాయకుడి వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రవిప్రసాద్ గౌడ్ తదితరులు


హస్మత్ పేట కౌండిన్య యువసేన ఆధ్వర్యంలో వినాయక నవరాత్రుల్లో వేలం పాటలో లడ్డును కైవసం చేసుకున్న పట్నం విజయనంద్ గౌడ్


పూజల్లో పాల్గొన్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాఖేష్‌రెడ్డి.కార్పొరేటర్ బోయిన దర్శన్.


మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శివాజీ నగర్ కాలనీ గణపయ్యకు ప్రత్యేక పూజలు చేస్తున్న వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వై.నరేష్, బిజెపి అధ్యక్షులు బీరప్ప, నాయకులు రవికాంత్‌రెడ్డి, ఏర్పుల కుమార్, మహేందర్, రాజేష్ తదితరులు.


కంటోన్మెంట్ 1వ వార్డు బోయిన్‌పల్లి పరిసర ప్రాంతాల్లో పతిష్టించిన గణేష్ నవరాత్రి వేడుకలో ,, పూజలు చేస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి

# ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు


బాగ్ అంబర్‌పేట, నందనవనంలో గణేష్ మండలంలో పూజలు నిర్వహించిన అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


భారతి నిలయంలో వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న అపార్ట్‌మెంట్ వాసులు

## ఇందిరమ్మ పాలనలో ఇచ్చిన భూములను లాక్కొని అక్రమ కేసులు పెట్టారు

**-న్యాయం చేయాలంటూ మంత్రి శ్రీధర్‌బాబుకు దళిత రైతుల మొర**

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** నాడు ఇందిరమ్మ పాలనలో దున్నుకోవడానికి ఇచ్చిన తమ భూములను గత బిఆర్ఎస్ పాలనలో లాక్కోవడమే కాకుండా అక్రమ కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ మండలానికి చెందిన వివిధ గ్రామాలకు చెందిన దళిత రైతులు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుతో మొరపెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగిందనీ ఈ మేరకు ప్రభుత్వం తమ ఆవేదనను అర్థం చేసుకొని తమను కాపాడాలని వారు ముక్తకంఠంతో మంత్రిని కోరారు. హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ మండలానికి చెందిన బడంగ్‌పేట్, నాదర్‌గుల్, గుర్రంగూడ, కుర్మల్‌గూడ తదితర గ్రామాలకు చెందిన భూబాధిత దళిత రైతులతో మల్లాపూర్‌లోని యెల్మేటి అమరేందర్‌రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల బాధిత రైతులు తమ గోడును మంత్రి శ్రీధర్‌బాబుకు వెళ్ళబోసుకున్నారు. బడంగ్‌పేట్ దళిత నేత, భూబాధిత రైతు పక్ష నాయకుడు గుడ్ల శ్రీనివాస్ మంత్రి ముందు కన్నీటి పర్యంతమై తమను ఏ విధంగా అక్రమ కేసుల్లో ఇరికించారో వెళ్లబోసుకున్నాడు. అదే విధంగా పలువురు రైతులు సైతం తమ బాధలను


భూ బాధితులకు న్యాయం చేస్తామని హామీనిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మ ంత్రికి ఏకరువు పెట్టారు. అనంతరం మంత్రి స్పందిస్తూ బాలాపూర్ మండలంలో అన్యా క్రాంతం అయిన ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, పార్కుల వివరాల నివే దిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బాధితులకు న్యాయం చేయడానికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మె ల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, పుట్టగళ్ళ జగన్, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో నగర పోలీస్ కమిషనర్ సమావేశం

**గణేష్ నిమజ్జనం, మిలాబ్ ఉన్ నబీ పండుగలపై ప్రత్యేక సూచనలు**

**పంజగుట్ట, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):**
పోలీసులు ప్రశాంత వాతావరణంలో, నిర్మలమైన మనస్సుతో డ్యూటీ చేసి సత్ఫలితాలు సాధించాలని నగర పోలీసు కమీషనర్ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. శుక్రవారం పశ్చిమ మండలం పరిధిలోని లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, ఎస్‌బీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన జరుగనున్న గణేష్ నిమజ్జనంతో పాటు 19 వ తేదీన జరుగనున్న మిలాద్ ఉన్ నబి పండుగ విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ఎక్కడికక్కడ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని ముందుకుపోవాలని సూచించారు. గతంలో జరిగిన సంఘటనలు ఒక సారి రివ్యూ చేసుకుని సమస్యాత్మక ప్రాంతాల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ వార్తల పట్ల కూడా సిబ్బంది జాగురూకతతో ఉండి సున్నితమైన విషయాలే ఒకోసారి ప్రమాదకరంగా మారతాయని, అలాంటి పుకార్ల వ్యాప్తి పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. సమావేశంలో పశ్చిమ మండలం డీసీపీ విజయకుమార్, ట్రాఫిక్ డీసీపీ1రాహుల్ హెగ్డే తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పుగూడలో అన్న ప్రసాద వితరణ

**చార్మినార్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త :**
గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా పాతబస్తీ ఉప్పుగూడలో పాతనగర మున్నూరు కాపు సంఘం గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ అల్లం భాను, పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఆకుల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బిట్ల హంసరాజ్, కమిటి సభ్యుల ఆధ్వర్యంలో అన్న దాన ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. నగర పాలక సంస్థ మాజీ జాయింట్ కమిషనర్ రవీందర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి అన్న దాన ప్రసాద వితరణను ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దేవరశెట్టి ప్రభాకర్, కసరపు చంద్రకుమార్, పల్లె శ్రవణ్, పోసు కృష్ణ, మామిడి నర్సింగరావు, ఎ.కిషన్ రావు, కె.భరత్ కుమార్, పల్లె సుశీల్, కటికె శ్రీధర్‌తో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

### ఆనందగల్లీలో కన్నుల పండువగా గణపతి నవరాత్రులు

**చార్మినార్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త :**
పాతబస్తీ ఆనందగల్లీలో కన్నుల పండువగా శ్రీ గణేష్ నవరాత్రి మహోత్సవా లు జరుగుతున్నాయి. శ్రీ శివ పార్వతుల ముందు శ్రీ వినాయకుడు ఉన్న సుంద రమైన విగ్రహాన్ని మండ లంలో ప్రతిష్టించారు. ఈ సందర్భంగా సంఘ సేవకులు, బిజెపి సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ మాట్లా డుతూ ఆనందగల్లీలో ప్రతీ సంవత్సరం శ్రీ గణేష్ నవరాత్రి మహోత్సవాలను వైభవంగా జ రుపుతున్నామని తెలిపారు. రాత్రి వేళల్లో పలు ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు శ్రీ విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు.

### సమాజంలోని ప్రతి వ్యక్తి భక్తి మార్గంలో నడవాలి

**మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త :**
సమాజంలోని ప్రతీ వ్యక్తి భక్తి మార్గంలో నడవాలని కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ కురుమ అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఎస్‌సిఆర్‌పి సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన శ్రీ విఘ్నేశ్వరునికి సాయి కిరణ్ కురుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సొసైటీ ప్రతినిధులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఆర్‌పి సొసైటీ ప్రతినిధులు జి.రామ్, ఎం.సుధాకర్, ఎం.శ్రీధర్, ఎం.సంతోష్ పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


పూజ కార్యక్రమంలో పాల్గొన్న కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ కురుమ

### ప్రపంచంలో అత్యధిక మాట్లాడుకునే భాషలలో హిందీ భాష రెండవది

**- డాక్టర్ బిఆర్.అంబేద్కర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్**

చిక్కడపల్లి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త: ప్రపంచంలో అత్యధిక మాట్లాడుకునే భాషలలో హిందీ భాష రెండవదని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ డిగ్రీ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ హిందీ దివస్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ మట్టా శేఖర్ మాట్లాడుతూ జాతీయ భాషగా పేరుగాంచిన హిందీ బాషకు సెప్టెంబరు పద్నాల్గవ తేదీ ప్రత్యేకం అని, హిందీ భాషను అధికార భాషగా ప్రభుత్వం ప్రకటించిందని, ఇది గర్వించదగిన విషయమన్నారు. జాతిపిత మహాత్మగాంధీ కూడా దేశంలో ఐక్యతను తీసుకురావడానికి ఈ భాషను వాడేవారన్నారు. కార్యక్రమంలో కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాషా విభాగం డాక్టర్ ముదిగొండ భవానీ, ఆంగ్ల అధ్యాపకురాలు కవిత, డాక్టర్ అశోక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీధర్, కృష్ణకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### జాతీయ భాష హిందీ అభివృద్ధికి మరింత కృషి జరగాలి : ప్రొఫెసర్ దత్తా సాకేలే..

**బేగంపేట సెప్టెంబరు 13ప్రభాతవార్త**
జాతీయ భాష హిందీ అభివృద్ధికి మరింత కృషి జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ ఎమ్ డి మొహకర్ విద్యాలయం, కలాం హిందీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా.దత్తా సాకోలే అన్నారు. శుక్రవారం బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హిందీ దివస్ వేడుకలను ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ డా.దత్తా సాకోలే మాట్లాడుతూ ప్రాంతీయ మరియూ ఆంగ్లేయ భాషలకు ప్రాధాన్యమున్న ప్రతి ఒక్కరికీ హిందీలో ప్రవేశం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. హిందీ విభాగ అధ్యక్షులు డా.యం.మధుకర్‌రావ్, డా.అప్పరుస్నీ సాబేగం, డా.మృదుల, డా.నందినీ, డా.సునీత, డా.పద్మకుమారి డా.కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### క్రిస్టియన్ మైనార్టీలను వైస్ ఛాన్సలర్‌గా నియమించాలి

**-క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ**


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జేఏసీ నేతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించేందుకు క్రిస్టియన్ మైనార్టీ (బిసి-సి)లను వైస్‌ఛాన్సలర్‌గా నియమించాలని తెలంగాణ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ గౌరవాధ్యక్షులు బిషప్ జాన్, ప్రెసిడెంట్ బాల్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ సాలమన్‌రాజు తదతరులు మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలోని క్రైస్తవ సమాజం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి అండగా నిలుస్తుందన్నారు. క్రైస్తవుల సంఖ్యాబలం ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వాలు అసెంబ్లీ, పార్లమెంట్ ఉన్నత విద్యలోని అధికారిక యంత్రాంగంలో అనుకున్నంత ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ క్రైస్తవుల్లో అధికమంది దళిత నేపథ్యం ఉన్నవారేనని చారిత్రక సామాజిక ,ఆర్థిక ప్రతికూలతను వారు ఇప్పటికీ ఎదుర్కొంటున్నారన్నారు. కావున లౌకిక, ప్రజాస్వామ్య అనుకూల తెలంగాణను ప్రోత్సహించే కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవులకు అన్నిరంగాల్లో ప్రాతినిథ్యం దక్కేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## కోర్టు ఆదేశాలను హైడ్రా పాటించలేదు

**-మల్లంపేట్ విల్లాల బిల్డర్ విజయలక్ష్మీ**

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
హైకోర్టు ఆదేశాలను కూడా హైడ్రా పాటించలేదని మల్లంపేట్‌లోని విల్లాల బిల్డర్ విజయలక్ష్మీ ఓ ప్రకటనలో ఆరోపించారు. 2021లో కోర్టు క్లీయర్‌గా తీర్పు ఇచ్చినా కూడా ఆవిషయాన్ని పట్టించుకోకుండా విల్లాలను కూల్చివేయడం ఏంటని ప్రశ్నించారు. తప్పుడు పత్రాలతో అనుమతులు పొందామని అంటున్నారని అసలు అనుమతుల కోసం తాను అప్లై చేయలేదని, అనుమతులు వచ్చిన తర్వాత ఆభూములను కొనుగోలు చేశామని ఆతర్వాత విల్లాలను నిర్మించినట్లు తెలిపారు. ఇటీవల 15విల్లాలను కూల్చి తీవ్ర నష్టం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. 2021లో బఫర్‌జోన్‌లో 5విల్లాలు ఉన్నాయని ,అందులో రెండు కూల్చారని అప్పుడే తాను కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. అప్పట్లో ఇరిగేషన్ అధికారులు బఫర్‌జోన్ అని నిరూపిం చక పోవడంతో కోర్టు తమకు ఫేవర్‌గా తీర్పు ఇచ్చిందన్నారు. అయినా ఇప్పటికీ ఆభవనాలు అలాగే ఉంచామన్నారు. కొంతమంది తాను లేడీడాన్ అని ప్రస్తావించడం సరికాదన్నారు. తనపై క్రిమినల్ కేసులు లేవని, గతంలో ఉన్నకేసు కూడా అప్పట్లో కూల్చివేతల సమయంలో పెట్టిందేనన్నారు. తనకు కోర్టుపై నమ్మకం ఉందని, ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

### రేషన్ బియ్యం విక్రయించటానికి ప్రయత్నించిన వ్యక్తి అరెస్ట్

**-18 క్వింటాల రేషన్ బియ్యం స్వాధీనం**

**చార్మినార్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త :** పాతబస్తీలో అక్రమంగా రేషన్ బియ్యం విక్రయించటానికి ప్రయత్నించిన ఓవ్యక్తిని హుస్సేనీఆలం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అతని వద్ద 18 క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కథనం ప్రకారం...పాతబస్తీ హిమ్మత్‌పుర ప్రాంతానికి చెందిన మహ్మద్ నూమాన్ (38) పాతబస్తీలోని ఇండ్లలో ప్రజలు వద్ద రేషన్ బియ్యం కిలో 12 రూపాయలు చొప్పున కొనుగోలు చేసి కర్ణాటకలోని బీదర్‌కు చెందిన సమీర్‌కు 15 రూపాయలకు విక్రయిస్తున్నాడు. కాగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇంటి వద్ద అమ్మటానికి నూమాన్ ఉంచాడు. సమాచారం అందుకున్న సివిల్ సప్లయి అధికారులు నూమాన్ ఇంటిపై దాడి చేసి 18 క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం హుస్సేనీఆలం పోలీసులకు అప్పగించారు. పోలీసులు నూమాన్‌పై కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు. బీదర్‌కు చెందిన సమీర్ పరారీలో ఉన్నాడు. ఈ కేసును హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మేడ్చల్‌లో సిఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన సినీ హీరో విశ్వక్ సేన్


మేడ్చల్‌లో సిఎంఆర్ షాపింగ్‌మాల్‌ను ప్రారంభించిన సినీ హీరో విశ్వక్ సేన్

**మేడ్చల్, సెప్టెంబర్ 13. ప్రభాతవార్త :** మేడ్చల్‌లో సిఎంఆర్ షాపింగ్ మాల్‌ను సినీ హీరో విశ్వక్ సేన్ శుక్రవారం ప్రారంభించారు. బస్టాండ్ ముందు విశాలమైన భవణంలో సిఎంఆర్ సంస్థ తన 34వ షాపింగ్‌మాల్‌ను నెలకొల్పారు. ప్రారంభోత్సవం అనంతరం సినీ హీరో అభిమానులను ఉత్సహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా వస్త్ర వ్యాపార రంగంలో కొనసాగుతున్న సిఎంఆర్ నాణ్యతకు ప్రత్యేకతగా నిలిచి ప్రజల అభిమానాన్ని చూరగొని తెలుగు రాష్ట్రాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. సిఎంఆర్ అంటే కుటుంబ సభ్యులు షాపింగ్ చేసేందుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వందలాది మంది తరలిరావడంతో మాల్ ప్రాంతం కిక్కిరిసి పోయింది. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ ఫౌండర్ చైర్మన్ మావూరి వెంకటరమణ, మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ, యాజమాన్య సభ్యులు, పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే కౌసర్


విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్.

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** వసతి గృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ తెలిపారు. వసతి గృహాలు పరిశుభ్రతతో పాటు విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించినప్పుడే వారు ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. శుక్రవారం లంగర్‌హౌస్ డివిజన్ బాపూనగర్‌లోని బాలుర వసతి గృహాన్ని సందర్శించి వసతిగృహం పరిసరాలను పరిశీలించడంతో పాటు విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ మాట్లాడుతూ..నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులే వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటారన్నారు. వారికి చదువుతో పాటు వసతి గృహాలను ఏర్పాటు చేసి ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. వసతి గృహాల్లో ఎలాంటి సమస్యలున్నా తనదృష్టికి తేవాలని కోరారు. ఆయన వెంట లంగర్‌హౌస్ డివిజన్ కార్పొరేటర్ ప్రతినిధి వజీ ఉజ్జమా సిద్ధికి, మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు మాతంగి రమేష్, హైమద్, బాలుర వసతి గృహం వార్డెన్ చంద్రశేఖర్ విద్యార్థులు ఉన్నారు.


బంజారాహిల్స్‌లో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## సిఎం సహాయనిధి పేదల పాలిట వరం : కౌన్సిలర్ ఐలయ్య


సిఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య

**తుర్కయంజాల్. సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ గ్రామంలో శుక్రవారం వార్డు కార్యాలయంలో 22వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. కమ్మగూడకు చెందిన గొబ్బురి ప్రవీణ్‌కు రూ.60వేల చెక్కును, కాట ఆరోగ్యమ్మకు రూ.54 చెక్కును, శంగిశెట్టి రాజేందర్‌కు రూ.45వేల చెక్కును, పి.సుధకు రూ.16 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిటవరమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రావు, వెంకటేష్ యాదవ్, గౌని రాము గౌడ్, సురేష్, మహేష్, వార్డు అధికారి గంగాధర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి : కార్పొరేటర్ అరుణ


పారిశుధ్య కార్మికులకు రిక్షాలు అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. జిహెచ్‌ఎంసి నుంచి వచ్చిన చెత్త రిక్షాలను శుక్రవారం కార్పొరేటర్ చేతుల మీదుగా కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు ముందు వరుసలో ఉండి వెలకట్టలేని సేవలందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్ గోవింద్ రెడ్డి, నాయకులు వినయ్, రాజేష్, నవీన్, కార్తీక్, మధు, మదన్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో బిఆర్‌ఎస్ నేతల ముందస్తు అరెస్టులు


ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు దృశ్యం.

**ఉప్పల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బిఆర్‌ఎస్ పార్టీ పిలుపు మేరకు ఆందోళనకు సిద్ధమైన పలువురు పార్టీ నేతలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితోపాటు, పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. బిఆర్‌ఎస్ నేతలు ఆకుల మహేందర్, వేముల సంతోష్ రెడ్డి, అన్న బాలకృష్ణ, నెర్థం భాస్కర్‌గౌడ్, సుక్క కిరణ్, జి.సత్య రాజ్‌గౌడ్, బింగి భరత్‌గౌడ్, అరటికాయల వంశీ, గొరిగె ఐలేష్, సుక్క కిరణ్, శ్రీనివాసాచారి, సత్యపాల్‌రెడ్డి, వేముల వెంకట్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కె.జగన్, శ్రీనివాస్‌యాదవ్, రామానుజం, నారాయణరెడ్డి, శ్యామ్, బాలు తదితరులను ఉప్పల్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి అనంతరం స్వంత పూచీకత్తుపై వదిలివేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అర్ధరాత్రి నుంచి బిఆర్‌ఎస్ పార్టీ నేతల ఇళ్ల ముందు పోలీసులు పహారా కాస్తున్నారని, ప్రజాపాలన ముసుగులో నియంత పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలు బిఆర్‌ఎస్ పార్టీకి కొత్త కాదని,కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరిస్తామని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో పలువురు బిఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర పరిష్కారం

### -స్టేట్ కన్వీనర్ నూనె ప్రభాకర్


ప్రభాకర్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ చేయగలిగిన కేసుల పరిష్కారం కోసం ఈనెల 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని, లోక్‌అదాల ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందని టిపిసిసి స్టేట్ లీగల్‌సెల్ ఛైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, లీగల్ హ్యూమన్ రైట్స్ ఆర్‌టిఐ విభాగం స్టేట్ కన్వీనర్ నూనె ప్రభాకర్‌లు పేర్కొన్నారు. టిపిసిసి లీగల్ హ్యూమన్ రైట్స్ ఆర్‌టిఐ విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా నూనె ప్రభాకర్ ఎన్నికైన సందర్భంగా న్యాయవాదులు శుక్రవారం శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా న్యాయ సేవల అధికారాల చట్టాన్ని అనుసరించి జాతీయ న్యాయసేవల అథారిటీ ఆధ్వర్యంలో వివిధ కోర్టులు, ట్రిబ్యునల్స్‌లో జాతీయ లోక్‌అదాలత్‌లు నిర్వహించడం జరుగుతుందని, లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను సులువుగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. గత మూడేళ్లలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లలో 13.57కోట్లకు పైగా కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ బెస్ట్ ప్రాక్టీషనర్ అన్నెబోయిన మట్టయ్య, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు గుంట ప్రేమ్‌కుమార్, న్యాయవాదులు మన్నెం మల్లయ్య,డి.రాములు, ఎస్.నాగేశ్వరరావు,లక్ష్మయ్య,చల్లా రామ్‌కళ్యాణ్‌లు పాల్గొన్నారు.

## స్వచ్ఛతాహీ సేవా వారోత్సవాలను విజయవంతం చేయాలి: మేయర్ దుర్గ

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా వారోత్సవాలను విజయవంతం చేయాలని మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఇంఛార్జి కమీషనర్ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా వారోత్సవాల సన్నాహక కార్యాచరణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నిర్దేశించిన కార్యక్రమాల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇఇ శ్రీనివాసులు, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్‌ఓ డి.చంద్రశేఖర్‌రెడ్డి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ రమేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రాము తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడల్లో ఘనంగా గణేష్ ఉత్సవాలు


నాగోల్ గ్రామంలో ఫిలాయిపల్లి నర్సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్‌యాదవ్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వాసవికాలనీ నివాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాగణపతికి రంగారెడ్డి జిల్లా కోర్ట్ న్యాయమూర్తులు పెనుమల గోపిక, నాగశ్రావ్య, ఎస్ఈ మాధవరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ ఛైర్మన్ చిలుక ఉపేందర్‌రెడ్డి, వాసవికాలనీ అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్త, ప్రధానకార్యదర్శి ఐత అంజయ్య, కృష్ణయ్య, సుధాకర్‌గుప్తా, గౌరిశెట్టి అరుణ్, తమ్మన్న శ్రీధర్, మాలే అనిల్, మేఘమాల, సుజాత పాల్గొన్నారు.


కొత్తపేట డివిజన్ లో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్. ఈ కార్యక్రమంలో నాయకులు మంచి రాజేష్, సుందర్ నారాయణ, మహేష్, శ్రీనివాస్‌యాదవ్, గోపాల్‌యాదవ్, మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.


చైతన్యపురిలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ బొగ్గారం దయానంద్ గుప్తా, నాయకుడు బొగ్గరం శరత్‌చంద్రాలను సన్మానిస్తున్న నిర్వాహకులు


బిఎన్‌రెడ్డినగర్ డివిజన్లోని పలు కాలనిలలో నెలకొల్పిన వినాయక మండపాలను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిలు సందర్శించి పూజలు నిర్వహించారు.


రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గణేష్ మండపం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు


ముసరాంబాగ్ లో గౌర విజయకాంత్ ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సామ్ రెడ్డి సురేందర్ రెడ్డి తదితరులు


గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులతో కంసనాబాద్ జగదీష్ చారి..


పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ శ్వేత, టిటిడి మాజీ ఎక్స్ అఫీషియోనసభ్యుడు పంతులు కరుణాకర్


ఉప్పల్‌లో గణనాధుడికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు బన్నాల గీత, ఎం.రజితరెడ్డి, శ్రీవాణి, చేతన తదితరులు

## మదర్‌డెయిరీ పాలకవర్గ సభ్యుల ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయం

**హయత్‌నగర్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** నార్మాక్ మదర్‌డెయిరీ పాలకవర్గ సభ్యుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్ధతుదారులు ఘన విజయం సాధించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించి 4, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి 2 మొత్తం 6 పాలకవర్గ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ మద్ధతు దారులు విజయం సాధించారు. హయత్‌నగర్‌లోని ఎస్.వి.ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఎన్నికలను అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం... ఓటర్లను (పాల సంఘాల ఛైర్మన్లు)క్యాంపులకు తరలించడంతో ఎన్నిక రసవత్తరంగా సాగింది. ప్రస్తుతం ఉన్న 9 మంది సభ్యులలో ఆరుగురు బీఆర్‌ఎస్‌కు చెందిన వారు కావడంతో ఎలాగోలా రెండు స్థానాలలో విజయం సాధించి ఛైర్మన్ పదవిని నిలబెట్టుకోవాలని బీఆర్‌ఎస్ ప్రయత్నించగా... బరిలో నిలబెట్టిన ఆరుగురు అభ్యర్థులను గెలిపించుకుని ఛైర్మన్ స్థానాన్ని దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కృతనిశ్చయంతో పనిచేసింది. ఈక్రమంలో ప్రభుత్వ పెద్దలు కాంగ్రెస్ పార్టీ మద్ధతుదారుల గెలుపు బాధ్యతను ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు అప్పగించగా... అందరినీ గెలిపించుకున్నారు. మొత్తం 297 మంది ఓటర్లుండగా ... ఉమ్మడి నల్లగొండకు చెందిన కాంగ్రెస్


గెలుపొందిన పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే ఐలయ్య, మాజీ ఛైర్మన్ జితేందర్‌రెడ్డి

ప్యానెల్ అభ్యర్థులు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి 229, కల్లేపల్లి శ్రీశైలం 222, పుప్పాల నర్సింహులు 181, బత్తుల నరేందర్‌రెడ్డి 177 ఓట్లు సాధించగా... ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి అగ్రాల నర్సింహారెడ్డి 242, మండలి జంగయ్య 237 ఓట్లు సాధించి గెలుపొందినట్లు ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు మదర్‌డెయిరీ కార్యాలయంలో ప్రస్తుత సభ్యులు 9 మంది, గెలుపొందిన సభ్యులు ఆరుగురు మొత్తం 15 మంది కలిసి నూతన ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు.

# టిమ్స్ ఆసుపత్రిలో అరుదైన మెదడు శస్త్ర చికిత్స


టిఎక్స్ ఆసుపత్రిలో అరుదైన మెదడు శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యుడితో రోగి తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త :** టిఎక్స్ ఆసుపత్రి వైద్యులు 26 ఏళ్ల యువకుడికి అరుదైన క్లిష్టమైన మెదడు శస్త్ర చికిత్స విజయవతంగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీకాంత్ వోడ్నాల వివరాలు వెల్లడించారు. అరుదుగా రోగికి రోజుకు ఐదు, పది సార్లు వచ్చే నిరంతరం మూర్చ వ్యాధితో బాధపడుతుండేవారని తెలిపారు. రోగికి ప్రసంగ ప్రాంతానికి సమీపంలో ఉన్న మెదడులో ట్యూమర్ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. దీంతో శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చిందని, లేకుంటే రోగికి ప్రసంగ లోపం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. న్యూరో సర్జన్ డా.నరేష్‌కుమార్ గజ్జల నేతృత్వంలో వైద్య బృందం అప్రమత్తంగా అవేక్ క్రానియోటమీ అనే ప్రత్యేక శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రసంగం, మోటర్ నియంత్రణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న ట్యూమర్ తొలగించేందుకు వీలు ఉంటుందని, శస్త్ర చికిత్స జరుగుతున్న సమయంలో రోగి పూర్తిగా మెలుకువతోనే ఉంటారని, ప్రసంగం, మోటర్ క్రియలను పరిశీలిస్తూ పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేయవచ్చని తెలిపారు. డా.కీర్తికర్‌రెడ్డి, డా.దీపక్‌రాజు, రవీందర్‌రెడ్డి, మేనేజ్‌మెంట్ బృందం సహకారంతో శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. టిఎక్స్ గ్రూపు ఆసుపత్రులు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీకాంత్ వోడ్నాల మాట్లాడుతూ ట్యూమర్ పూర్తిగా తొలగించామని, రోగి ప్రసంగం, మోటర్ విధులు ఏవి దెబ్బతినలేదని తెలిపారు. మూడువారాల పాటు రోగికి ఎలాంటి సీజర్స్ రాలేదని, పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు. అవేక్ క్రానియోటమీ టిఎక్స్ ఆసుపత్రులలోని అధునాతన వైద్య శక్తులను చాటి చెప్పిందని, న్యూరాజికల్ కేసులను నిర్వహించడంలో ఆసుపత్రి వైద్యులు కొత్త చరిత్ర సృష్టించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, పాల్గొన్నారు.

## ఏకదంతా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**జవహర్‌నగర్ సెప్టెంబర్13 ప్రభాతవార్త:** జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ విగ్నేశ్వర కాలనీలో ఏకదంతా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జవహర్‌నగర్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య సేవలు అందించిన మ్యాక్స్‌విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి, డాక్టర్ ఆర్యాస్ మల్టి స్పెషాలిటీ డెంటల్ ఆసుపత్రి, ఆర్వి దయగ్నోస్టిక్ సెంటర్ సిబ్బందితో పాటు ఏకదంతా యూత్ అసోసియేషన్ సభ్యులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌రాజ్, యూత్ కమిటీ సభ్యులు ప్రదీప్, ప్రసన్న, బన్నీ, కరుణాకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి : యెండల లక్ష్మీనారాయణ

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** విదేశాల్లో భారత దేశ ప్రతిష్టను దిగజారుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఎఐసిసి అగ్రనేత, రాయ్‌బరేలి ఎంపి రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, రంగారెడ్డి జిల్లా బిజెపి సభ్యత్వ నమోదు ఇంఛార్జి యెండల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో దీన్‌దయాళ్‌నగర్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రూరల్ భాజపా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగిన ఆయన పలువురికి సభ్యత్వం నమోదు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడచిన పది సంవత్సరాల్లో ప్రపంచ పటంలో భారత్‌ను శక్తివంతమైన దేశంగా నిలిపిన ఘనత ప్రధాని మోడీకి దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కీసర గోవర్ధన్‌రెడ్డి, మద్ది రాజశేఖర్‌రెడ్డి, పసునూరి బిక్షపతిచారి, భీమ్‌రాజ్, కీసర హరినాథ్‌రెడ్డి, కొండ్రు గౌరీ శంకర్, ఆర్.యాదగిరి యాదవ్, సూల ప్రభాకర్, కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, విక్కీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి లేని లోటు తీర్చలేనిది : సిపిఎం

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ (సిపిఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి లేని లోటు ప్రజల పక్షాన నిలిచి పోరాటాలు చేసే వారికి తీరని లోటని బాలాపూర్ మండల సిపిఎం నేతలు అన్నారు. శుక్రవారం మీర్‌పేట్ చౌరస్తాలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం.యాదయ్య, రాజలింగం, దాసరి బాబు, యాదగిరిచారి, ప్రకాశ్, మల్లికార్జున్, మల్లేష్, యాదయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

## తుర్కయాంజాల్‌లో సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపణీ


చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య

**తుర్కయాంజాల్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో శుక్రవారం సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా 22వ వార్డు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు.కార్యక్రమంలో నాయకులు వెంకట్రావు, వెంకటేశ్ యాదవ్, గౌరి రాము గౌడ్, సురేష్, మహేష్, గంగాధర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడా విభాగంలో సత్యసాయి విద్యార్థుల ప్రతిభ

**ఉప్పల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త :** మండల స్థాయి అండర్ -14 కబడ్డీ మహిళా క్రీడా పోటీలలో రామంతాపూర్‌కు చెందిన సత్యసాయి స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. అండర్ -17 విభాగంలో బాలుర విభాగంలో రెండో స్థానం సాధించారు. ఈ మేరకు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గద్దం సాయికిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు, క్రీడలపై కూడా తగు శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు.

## మొక్కలను సంరక్షించాలి : ఆకుల



**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరు తీసుకోవాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ కుమార్ పేర్కొన్నారు. సరూర్‌నగర్ డివిజన్ లక్ష్మీనగర్‌కాలనీ పార్క్‌లో శుక్రవారం 75వ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాతతో కలిసి మొక్కలు నాటారు. సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కాలుష్య నివారణకు మొక్కలు నాటడమే సరైన మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.వాయుకుమార్, ప్రధానకార్యదర్శి శ్రీధర్‌రాజ్, సభ్యులు బాపురెడ్డి, నరసింహగుప్త, మహేష్‌యాదవ్, నిరంజన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, పాల్గొన్నారు.

## అమ్మకి గుర్తుగా ఒక మొక్కను నాటాలి : చింతల


మొక్కలు నాటుతున్న చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్

**వనస్థలిపురం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ గ్రీన్ ఫీల్డ్ కాలనీ లో 75వ వనమహోత్సవం సందర్భంగా అమ్మ పేరుతో నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ నేను అమ్మ పేరిట ఒక మొక్క నాటాను, మీరు కూడా మీ అమ్మకి గుర్తుగా ఒక మొక్కను నాటాలని విజ్ఞప్తి చేశారు. ఈ సృష్టిలో మనుషులే కాదు సకల జీవరాసులు వాటి జీవన విధానం ఆనందంగా ఆరోగ్యంగా వెళ్లాలి అంటే కచ్చితంగా కావలసింది స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన నీరు. అటువంటి గాలి కలుషితం కాకుండా స్వచ్ఛంగా ఉండాలి అంటే కచ్చితంగా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఏఈ మేధ, మానస, కాలనీ వాసులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన పనులను పర్యవేక్షించిన మున్సిపల్ డిసి రాజు


సఫిల్‌గూడ చెరువులో వినాయక నిమజ్జన పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ డీసీ రాజు..

**నేరెడ్‌మెట్ సెప్టెంబర్13 ప్రభాతవార్త:** గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేలా అన్ని ఏర్పాటు చేయడం జరిగిందని మల్కాజిగిరి సర్కిల్ మున్సిపల్ డిసి రాజు పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని సఫిల్‌గూడ చెరువులో జరుగుతున్న వినాయక నిమజ్జన పనులను ఆయన సంబంధిత అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సఫిల్‌గూడ చెరువులో నిమజ్జనానికి తరలివచ్చే గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. నిమజ్జన సమయంలో విద్యుత్, ఇరిగేషన్, మున్సిపల్, ఆరోగ్య తదితర శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. సర్కిల్ పరిధిలో గుంతలు గుంతలుగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శానిటేషన్ సిబ్బందికి నూతన రిక్షాలు అందజేత


శానిటేషన్ సిబ్బందికి నూతన రిక్షాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి

**మలక్ పేట ,సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** శానిటేషన్ సిబ్బందికి నూతన రిక్షాలు అందజేయడం అభినందనీయమని మూసారంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. జిహెచ్‌ఎంసి శానిటేషన్ విభాగం వారితో కలిసి మూసారంబాగ్ లో ఆమె సూపర్వైజర్లకు, సిబ్బందికి నూతన రిక్షాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో పలుమార్లు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, ఇప్పటి స్పందన లభించిందన్నారు. సర్కిల్ 6లో 116 రిక్షాలు కావాలని ప్రతిపాదనలు పెడితే 50 రిక్షాలు మాత్రమే మంజూరు అయ్యాయన్నారు. త్వరలో మిగిలిన వాటిని కూడా మంజూరు చేయాలని, అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం మాములు రిక్షాలకు బదులు ఎలక్ట్రిక్ రిక్షాలను లేబర్ కి ఏర్పాటు చేస్తే వారు కూడా ఎక్కువ శ్రమ పడకుండా సులువుగా పనిచేస్తారన్నారు. ఈ విషయాన్ని కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ రమేష్, సూపర్వైజర్లు ముజీబ్, శ్రీనివాస్, నర్సింగ్, సుభాష్, అక్షయ్ ,గణేష్, శ్రీను ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం


అవిశ్వాస తీర్మాణ బలపరీక్ష సమావేశానికి హాజరైన సభ్యులు

**హయత్‌నగర్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌పై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. శుక్రవారం తట్టిఅన్నారం లోని వార్డు కార్యాలయంలో ఆర్డీవో ఏర్పాటు చేసిన సమావేశానికి 17 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాస తీర్మాణానికి అనుకూలంగా మూజువాణి పద్దతిలో చేయిత్తి ఓటువేశారు. దీంతో ఆర్డీవో అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటిస్తూ తదుపరి ఛైర్మన్ ఎన్నిక వరకు వైస్‌ఛైర్ పర్సన్‌కు బాధ్యతలు అప్పగించారు. అవిశ్వాస తీర్మాణంపై సంతకాలు చేసిన వారు కాకుండా మిగతా సభ్యులు సమావేశానికి గౌర్హాజరయ్యారు.

## పెండింగ్ బిల్లును వెంటనే విడుదల చేయాలి : పోల్కం శ్రీనివాస్


ఎమ్మెల్యే బలాలకు వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

**మలక్ పేట,సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ జలమండలి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జేఏసీ మీడియా ఇన్చార్జ్ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. గతంలో టిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్యువల్ మెయిన్టెనెన్స్ సెక్షన్ టెండర్ విధానాన్ని తక్షణమే పొడిగించకుండా గతంలో ఉన్న పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఈ మేరకు మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలను కలిసి వినతి పత్రం సమర్పించారు. దీంతో ఎమ్మెల్యే బలాల తక్షణమే స్పందించి పాత విధానాన్ని కొనసాగించాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డికి సూచిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు.

## బాలాపూర్ గణేషునికి ఎంపి ఈటల పూజలు


ఈటెలకు లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తున్న కళ్లెం నిరంజన్‌రెడ్డి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ బాలాపూర్ గణేషునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ మండపాన్ని సందర్శించిన ఆయనకు ఉత్సవ కమిటీ సాదరంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించింది. అనంతరం సన్మానించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అందెల శ్రీరాములు యాదవ్, మద్ది రాజశేఖర్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.